క్షుద్రపూజలకు విద్యార్థి బలి!

- పాఠశాల అభివృద్ధి చెందాలని విద్యార్థిని బలిచ్చిన యాజమాన్యం
- యూపీలోని హాథ్రస్‌లో దారుణం
- యజమాని సహా ఐదుగురి అరెస్ట్

ఆగ్రా, సెప్టెంబర్ 27: ఉత్తరప్రదేశ్‌లోని హాథ్రస్‌లో దారుణ ఘటన చోటుచేసుకున్నది. మూఢనమ్మకాలతో ఒక స్కూల్ యజమాని తన పాఠశాలలో చదువుతున్న ఓ విద్యార్థిని క్షుద్రపూజలకు బలిచ్చాడు. దీంతో స్కూల్ యజమాని, డైరెక్టర్‌తో పాటు ప్రిన్సిపాల్, ఇద్దరు ఉపాధ్యాయులను పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డీఎల్ పబ్లిక్ స్కూల్ యజమాని అయిన జషోదన్ సింగ్‌కు క్షుద్ర పూజలు, మూఢ నమ్మకాలపై అపార నమ్మకం. స్కూల్, తన కుటుంబం అభివృద్ధి చెందాలంటే ఎవరినైనా చిన్నారిని బలి ఇవ్వమని కుమారుడు, స్కూల్ డైరెక్టర్ అయిన దినేశ్ బాఘేల్‌కు చెప్పాడు. దీంతో అదే పాఠశాలలో రెండో తరగతి చదువున్న 11 ఏండ్ల కృతార్థ్‌ను సెప్టెంబర్ 23న ఉపాధ్యాయుడు రాంప్రకాశ్ సోలంకి, దినేశ్ భాఘేల్, జషోదన్ సింగ్ కలిసి స్కూల్ హాస్టల్ నుంచి అపహరించారు. తర్వాత విద్యార్థిని ఒక నిర్జన ప్రదేశంలోకి తీసుకుపోయారు. తర్వాత అక్కడ కొన్ని పూజలు చేశారు. ఇది చూసి ఆ బాలుడు ఏడవడం ప్రారంభించాడు. అనంతరం అతడి గొంతు నులిమి చంపారు. ఈ నరబలి జరుగుతున్న సమయంలో ప్రిన్సిపాల్ లక్ష్మణ్ సింగ్, మరో టీచర్ వీర్‌పాల్ సింగ్‌లు కూడా అక్కడే ఉండి ఎవరూ రాకుండా కాపలా కాశారు. తర్వాత బాలుడి మృతదేహాన్ని కారులో తీసుకుని వెళ్తుండగా, తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారిని అరెస్ట్ చేశారు. తమ స్కూల్, కుటుంబం మరింత ఐశ్వర్యాభివృద్ధి పొందడానికే బాలుడిని నరబలి ఇచ్చినట్టు నిందితులు పోలీసులకు తెలిపారు.

నీట మునిగిన చైనా అణు జలాంతర్గామి!

వాషింగ్టన్: వుహాన్ సమీపంలో చైనా ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న అణు జలాంతర్గామి నిర్మాణంలో ఉండగానే నీట మునిగిందని అమెరికా రక్షణ శాఖ అధికారి ఒకరు గురువారం వెల్లడించారు. ప్రపంచంలోనే అత్యంత భారీ నావికా దళాన్ని రూపొందిస్తున్న చైనాకు ఇది పెద్ద ఎదురుదెబ్బ అని భావిస్తున్నారు. ఈ ఏడాది మే, జూన్ నెలల మధ్యలో ఆ జలాంతర్గామి మునిగిపోయినట్టు తెలుస్తున్నది. ఉపగ్రహం తీసిన ఫొటోల్లో.. నీటి అడుగు నుంచి జలాంతర్గామిని పైకి లేపేందుకు అవసరమైన భారీ క్రేన్లు అక్కడ కనిపించాయని ఆ అధికారి పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించి తమ వద్ద ఎటువంటి సమాచారం లేదని అమెరికాలోని చైనా రాయబార కార్యాలయం తెలిపింది. ఆ జలాంతర్గామిలో అణు ఇంధనం నింపారా లేక ఘటన జరిగినప్పుడు అందులోని న్యూక్లియర్ రియాక్టర్ పనిచేస్తున్నదా అన్న విషయాలు వెల్లడి కాలేదు. అయితే జలాంతర్గామి మునిగిపోయినప్పుడు ఆ ప్రాంతంలో రేడియేషన్ ప్రభావమేమీ లేదని వెల్లడైంది.

రూ.100 కోట్లతో 'శివ సృష్టి'

- ఛత్రపతి శివాజీ స్మృతివనంగా ఏర్పాటు
- మహారాష్ట్ర సర్కారు నష్టనివారణ చర్యలు

ముంబై సెప్టెంబర్ 27 (నమస్తే తెలంగాణ): రాజ్‌కోట్‌లో ఛత్రపతి శివాజీ విగ్రహం కూలిపోయిన ఘటనపై విమర్శలు వెల్లువెత్తిన నేపథ్యంలో మహారాష్ట్ర ప్రభుత్వం నష్టనివారణ చర్యలకు పూనుకుంది. విగ్రహం కూలిన ప్రాంతంలోనే రూ.100 కోట్ల వ్యయంతో 'శివసృష్టి' పేరుతో శివాజీ స్మృతివనాన్ని నిర్మించాలని నిర్ణయించింది. ఇందులో భారీ శివాజీ విగ్రహాన్ని సైతం ఏర్పాటు చేయనున్నది. ఇందుకోసం ఇప్పటికే ప్రణాళిక సిద్ధం కాగా త్వరలో టెండర్లు పిలువనున్నారు. ఆవిష్కరించిన ఆరు నెలల్లోనే శివాజీ విగ్రహం కూలిపోవడం పట్ల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చిన సంగతి తెలిసిందే.

లెబనాన్ సరిహద్దుకు యుద్ధట్యాంకులు

- భారీగా మోహరించిన ఇజ్రాయెల్ సైన్యం
- బీరుట్‌లోని హెజ్బొల్లా హెడ్‌క్వార్టర్స్‌పై దాడి
- లెబనాన్‌లో వారం రోజుల్లో 700 మంది మృతి
- టెల్ అవీవ్ లక్ష్యంగా హౌతీల క్షిపణి దాడులు

లెబనాన్ సరిహద్దుల్లో మోహరించిన ఇజ్రాయెల్ యుద్ధట్యాంకులు

జెరూసలేం, సెప్టెంబర్ 27: ఇజ్రాయెల్ - లెబనాన్ మధ్య యుద్ధ పరిస్థితులు తీవ్రమవుతున్నాయి. లెబనాన్‌పై భూతల దాడులకు ఇజ్రాయెల్ సిద్ధమవుతున్నది. ఈ మేరకు సరిహద్దుకు భారీగా యుద్ధట్యాంకులను తరలిస్తున్నది. హెజ్బొల్లా లక్ష్యంగా లెబనాన్‌లోకి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సైనిక బలగాలకు ఇజ్రాయెల్ ఇప్పటికే ఆదేశించింది. 'మనం హెజ్బొల్లాపై వాయు, సముద్ర మార్గాల్లో దాడులు చేస్తున్నాం, ఇక భూతల దాడులకు సైతం సిద్ధంగా ఉండండి' అంటూ సైనికులను ఉద్దేశించి ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి యోవ్ గల్లాంట్ పిలుపునిచ్చారు. సరిహద్దు ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలని ఇజ్రాయెల్ కోరుతున్నది.

హెజ్బొల్లా అధినేత లక్ష్యంగా దాడి

శుక్రవారం లెబనాన్‌లో ఇజ్రాయెల్ బాంబులు, క్షిపణులతో విరుచుకు పడింది. ఈ దాడుల్లో 25 మంది మరణించారు. బీరుట్‌లోని హెజ్బొల్లా హెడ్‌క్వార్టర్స్ లక్ష్యంగా దాడులు జరిపినట్టు ఇజ్రాయెల్ మిలటరీ ప్రకటించింది. హెజ్బొల్లా నేత హస్సన్ నస్రుల్లాను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరిపినట్టు ఇజ్రాయె ల్‌లోని ప్రధాన టీవీ చానల్స్ ప్రకటించాయి. ఈ వారంలో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 700 మంది మరణించారని, గత మూడు రోజుల్లో 30 వేల మంది సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. మరోవైపు హెజ్బొల్లా సైతం ఇజ్రాయెల్‌పై రాకెట్లతో దాడి చేస్తున్నది. లెబనాన్‌పై 21 రోజుల పాటు దాడులు విరమించుకోవాలని అమెరికా చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తిరస్కరించింది. హెజ్బొల్లాపై విజయం సాధించేవరకు పోరాడతామని స్పష్టం చేసింది.

ఇజ్రాయెల్‌పైకి హౌతీల క్షిపణి

ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతుండగానే యెమెన్ కేంద్రంగా పని చేసే హౌతీలు ఇజ్రాయెల్‌పై దాడికి దిగారు. ఇజ్రాయెల్ దాడిలో గురువారం మరణించిన హెజ్బొల్లా నాయకుడు మహమ్మద్ స్రుర్ మృతికి ప్రతీకారంగా ఈ దాడి చేశామని హౌతీలు ప్రకటించారు. లెబనాన్, హెజ్బొల్లాకు మద్దతు ఇచ్చేందుకు వెనుకాడబోమని హౌతీల నాయకులు అబ్దుల్ మాలిక్ అల్-హౌతీ హెచ్చరించారు. కాగా, సిరియాలోని డమాస్కస్‌పైనా ఇజ్రాయెల్ దాడి చేసింది.

విజయం సాధించే వరకు పోరాటం: నెతన్యాహూ

లెబనాన్ సరిహద్దులో మా లక్ష్యాలు సాధించే వరకు హెజ్బొల్లాను నిర్వీర్యం చేసేందుకు పోరాటం చేస్తామని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ ప్రకటించారు. శుక్రవారం ఆయన ఐక్యరాజ్యసమితిలో ప్రసంగించారు. 'తనకు ఉన్న ముప్పును తొలగించుకునేందుకు, తన పౌరులను వారి ఇండ్లకు సురక్షితంగా చేర్చేందుకు ఇజ్రాయెల్‌కు అన్ని హక్కులు ఉన్నాయి. అదే పని ఇప్పుడు చేస్తున్నది. ఎల్‌పాసో, శాన్‌డియాగోను ఉగ్రవాదులు ఘోస్ట్ టౌన్‌లుగా మారిస్తే అమెరికా సహిస్తుందా? కానీ, ఇజ్రాయెల్ ఏడాదిగా సహిస్తున్నది. హమాస్ లొంగిపోతేనే యుద్ధం ముగుస్తుంది. లేకపోతే విజయం సాధించే వరకు మా పోరాటం కొనసాగుతుంది' అని నెతన్యాహూ పేర్కొన్నారు. మరోవైపు ఇరాన్‌లో తాము చేరుకోలేని ప్రాంతం అంటూ ఏదీ లేదని హెచ్చరించారు.

జపాన్ నూతన ప్రధానిగా ఇషిబా

టోక్యో, సెప్టెంబర్ 27: జపాన్ ప్రధానమంత్రి పుమియో కిషిదా వారసుడిగా ఆ దేశ రక్షణ శాఖ మాజీ మంత్రి షిగెరు ఇషిబా (67) ఎన్నికయ్యారు. శుక్రవారం అధికార లిబరల్ డెమోక్రటిక్ పార్టీ అధ్యక్ష ఎన్నికలో విజయం సాధించిన ఇషిబా.. వచ్చేవారం జపాన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్నారు. 2021లో కిషిదా ఎల్‌డీపీ అధ్యక్షునిగా ఎన్నికైన విషయం విదితమే. ఆయన మూడేండ్ల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనుండటంతో ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి తాజాగా ఎన్నిక నిర్వహించారు. అవినీతి ఆరోపణల నేపథ్యంలో కిషిదా ఈ ఎన్నికకు దూరంగా ఉన్నారు. ఎల్‌డీపీ అధ్యక్ష పదవికి ఇద్దరు మహిళలు సహా మొత్తం 9 మంది పోటీపడ్డారు. ప్రస్తుత ప్రధాని కిషిదా, ఆయన మంత్రి వర్గం వచ్చే నెల 1న రాజీనామా చేయనున్నది. అనంతరం ఇషిబా నేతృత్వంలో కొత్త మంత్రి వర్గం కొలువుదీరనున్నది.

ప్రవాస భారతీయుల మిత్రులకు ఉచిత వీసాలు

న్యూఢిల్లీ: విదేశాల్లో నివసిస్తున్న భారతీయుల విదేశీ మిత్రులను భారత దేశ పర్యాటక రంగంవైపు ఆకర్షించేందుకు కేంద్ర ప్రభుత్వం వినూత్న పథకాన్ని అమలు చేయబోతున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, ఓవర్సీస్ సిటిజన్ ఆఫ్ ఇండియా (ఓసీఐ) కార్డ్‌హోల్డర్స్ తమ విదేశీ మిత్రులను వీసా కోసం నామినేట్ చేయవచ్చు. ఒక ఓసీఐ కార్డ్‌హోల్డర్ గరిష్ఠంగా ఐదుగురు మిత్రులను నామినేట్ చేయడానికి అవకాశం ఉంటుంది. ఓ వెబ్‌సైట్ ద్వారా వీరికి ఉచితంగా ఈ-వీసాలను భారత ప్రభుత్వం జారీ చేస్తుంది. ప్రపంచ పర్యాటక దినోత్సవాల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెఖావత్ మాట్లాడుతూ, 'చలో ఇండియా' కార్యక్రమంలో భాగంగా లక్ష మంది విదేశీ పర్యాటకులకు ఉచితంగా వీసాలను ఇస్తామన్నారు.

పని ఒత్తిడికి మరో ఉద్యోగిని బలి

న్యూఢిల్లీ: పుణెలో పని ఒత్తిడికి 26 ఏండ్ల ఉద్యోగిని మరణించడంతో కార్పొరేట్ కంపెనీలలో విష పని సంస్కృతి గురించి విస్తృతంగా చర్చ జరుగుతున్న క్రమంలో అలాంటి ఘటనే థాయ్‌లాండ్‌లో చోటుచేసుకుంది. అనారోగ్యంతో ఉన్నప్పటికీ సిక్ లీవ్ ఇవ్వడానికి మేనేజర్ నిరాకరించడంతో కార్మికురాలొకరు విధి నిర్వహణలో కుప్పకూలి మరణించిన ఘటన థాయ్‌లాండ్‌లో జరిగింది. 30 ఏండ్ల మే అనే కార్మికురాలు థాయ్‌లాండ్‌లోని డెల్టా ఎలక్ట్రానిక్స్ కంపెనీలో పనిచేస్తున్నది. పెద్దపేగుకు సంబంధించిన వ్యాధితో ఆమె సెప్టెంబర్ 5 నుంచి 9 వరకు సిక్ లీవ్ తీసుకుంది. పరిస్థితి మెరుగుకాకపోవడంతో మరి కొన్ని రోజుల సిక్ లీవ్ కోసం మేనేజర్‌కు విజ్ఞప్తి చేసింది. దానికి అతడు నిరాకరించడంతో ఆమె అలాగే అనారోగ్యంతో విధులకు హాజరైంది.

అగ్నివీరులకు బ్రహ్మోస్ ఏరోస్పేస్‌లో రిజర్వేషన్లు

న్యూఢిల్లీ: బ్రహ్మోస్ సూపర్‌సానిక్ క్రూయిజ్ మిసైల్స్‌ను తయారు చేసే బ్రహ్మోస్ ఏరోస్పేస్ కీలక నిర్ణయం తీసుకుంది. మాజీ అగ్నివీరులకు సాంకేతిక, పరిపాలన, భద్రతా విభాగాల్లో రిజర్వుషన్లు కల్పించాలని నిర్ణయించింది. సాంకేతిక, సాధారణ పరిపాలన విభాగాల్లో కనీసం 15 శాతం; పరిపాలన, భద్రత విభాగాల్లో భర్తీ చేయవలసిన ఉద్యోగాల్లో 50 శాతం అగ్నివీరుల కోసం కేటాయిస్తున్నట్లు ఈ కంపెనీ తెలిపింది.

డిప్యూటీ సీఎం కుమారుడి రీల్ షూటింగ్‌కు ఎస్కార్టుగా పోలీస్ వాహనాలు

న్యూఢిల్లీ: రాజస్థాన్ ఉప ముఖ్యమంత్రి, బీజేపీ నేత ప్రేమ్ చంద్ బైర్వా కుమారుడు ఓపెన్ టాప్ జీపు నడుపుతూ రీల్ షూటింగ్ చేయడం, ఆయన వాహనానికి రెండు పోలీస్ వాహనాలు ఎస్కార్టుగా రావడం విమర్శలకు దారితీసింది. మైనర్ అయినప్పటికీ వాహనాన్ని నడుపుతూ రీల్ చేయడం, అతనికి పోలీసులు రెండు వాహనాల్లో ఎస్కార్టుగా రావడం అధికార దుర్వినియోగమేనని విపక్షాలు విమర్శించాయి. ఆ వాహనంలో ప్రేమ్‌చంద్ బైర్వా కుమారుడు ఆశు బైర్వా వాహనం నడుపుతుండగా, అతని పక్కన కాంగ్రెస్ నేత పుష్పేంద్ర భరద్వాజ్ కుమారుడు కూర్చుని ఉన్నాడు.

ముడా స్కామ్‌లో ఏ1గా సిద్ధరామయ్య

- ఏ2గా ఆయన భార్య పార్వతి
- లోకాయుక్త పోలీసుల ఎఫ్ఐఆర్
- సీబీఐ విచారణ కోసం హైకోర్టుకు ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ

బెంగళూరు, సెప్టెంబర్ 27: ముడా స్కామ్‌లో కర్ణాటక కాంగ్రెస్ ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై కేసు నమోదైంది. ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆదేశాల మేరకు లోకాయుక్త పోలీసులు శుక్రవారం మైసూరులో ఆయనపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇందులో సిద్ధరామయ్యను ఏ1గా, ఆయన భార్య బీఎం పార్వతిని ఏ2గా, బావమరిది మల్లికార్జున స్వామిని ఏ3గా, దేవరాజును ఏ4గా పేర్కొన్నది. దేవరాజు వద్ద నుంచే మల్లికార్జున స్వామి భూమిని కొని పార్వతికి బహుమతిగా ఇచ్చాడని చెప్తున్నారు. తక్కువ విలువ కలిగిన ఈ భూమిని అభివృద్ధి పనుల కోసం మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(ముడా) సేకరించి, పరిహారంగా పార్వతికి ఖరీదైన 14 స్థలాలను కేటాయించిందనే ఆరోపణలు ఉన్నాయి. స్నేహమయి కృష్ణ అనే సమాచార హక్కు చట్టం కార్యకర్త సిద్ధరామయ్యపై ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ కేసులో సిద్ధరామయ్యపై విచారణ చేసేందుకు గవర్నర్ అనుమతించగా, ఆయన హైకోర్టులో సవాల్ చేశారు. హైకోర్టు సైతం విచారణ జరగాల్సిందేనని స్పష్టం చేసింది. దీంతో ప్రజా ప్రతినిధుల కేసులు విచారించే ప్రత్యేక కోర్టు సిద్ధరామయ్యపై కేసు నమోదు చేయాలని లోకాయుక్త పోలీసులను బుధవారం ఆదేశించింది.

సీబీఐ విచారణ కోసం హైకోర్టుకు

సిద్ధరామయ్యపై సీబీఐ ద్వారా విచారణకు ఆదేశించాలని కోరుతూ ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణ కర్ణాటక హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రానున్నది. లోకాయుక్త విచారణ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా ఉంటుందని అనుకోవడం లేదని, సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని కోర్టును కోరారు.

ప్రొఫెషనల్ దొంగగా కాంగ్రెస్ తీరు: బీజేపీ

సీబీఐకి సాధారణ సమ్మతిని ఉపసంహరించుకుంటూ సిద్ధరామయ్య మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని బీజేపీ తీవ్రంగా తప్పుపట్టింది. ఇది ముడా స్కామ్‌లో సీబీఐ విచారణ నుంచి తప్పుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రయత్నమని బీజేపీ అధికార ప్రతినిధి షెహ్‌జాద్ పూనావాలా పేర్కొన్నారు. చట్టం నుంచి తప్పించుకునేందుకు ఒక కరుడుగట్టిన దొంగ ఎలాంటి ప్రయత్నం చేస్తాడో కాంగ్రెస్ కూడా అదే చేసిందని విమర్శించారు. ప్రొఫెషనల్ దొంగగా, రాజకీయ పార్టీగా కాంగ్రెస్ స్పందించిందని పేర్కొన్నారు.

ఉత్తమ శాస్త్రవేత్తల జాబితాలో

ప్రొ.సుబ్బారావు

ప్రకటించిన స్టాన్‌ఫర్డ్ వర్సిటీ

హైదరాబాద్, సెప్టెంబర్ 27: హైదరాబాద్‌కు చెందిన విశ్రాంత ప్రొఫెసర్ నందిపాటి సుబ్బారావుకు అరుదైన గుర్తింపు లభించింది. ప్రభావశీల శాస్త్రవేత్తలతో కూడిన 'ప్రపంచ ఉత్తమ 2 శాతం శాస్త్రవేత్తల జాబితా-2024'లో ఆయనకు చోటు దక్కింది. అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ఈ జాబితాను విడుదల చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఉత్తమ శాస్త్రవేత్తల్లో ఆయనకు 3,766వ ర్యాంకు దక్కింది. వరుసగా ఐదో ఏడాది ఆయన ఈ జాబితాలో నిలవడం విశేషం. విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో భూవిజ్ఞాన శాస్త్ర విభాగాధిపతిగా ప్రొఫెసర్ నందిపాటి సుబ్బారావు పని చేశారు. ఆయన పరిశోధనలకు సంబంధించి ఇప్పటివరకు 130 పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ జర్నళ్లలో ప్రచురితమయ్యాయి. ఇంతకుముందు ఆయన నేషనల్ మినరల్ అవార్డుతో పాటు పలు అవార్డులను అందుకున్నారు.

కేరళలో మరో మంకీ పాక్స్ కేసు

తిరువనంతపురం: కేరళలో మరో ఎంపాక్స్ కేసు వెలుగులోకి వచ్చినట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ శుక్రవారం తెలిపింది. ఈ వ్యాధి లక్షణాలు ఉన్నవారు చికిత్స చేయించుకోవాలని కోరింది. శుక్రవారం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో పరిస్థితిని సమీక్షించినట్లు వివరించింది. ఎంపాక్స్ వ్యాధిగ్రస్థునితో కలసిన వారి జాబితాను తయారు చేశామని, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టామని మంత్రి వీణా జార్జ్ తెలిపారు. విదేశాల నుంచి రాష్ట్రానికి వచ్చిన వారు ఎంపాక్స్ లక్షణాలు కనిపిస్తే, ఆరోగ్య శాఖను సంప్రదించాలని కోరారు. అన్ని జిల్లాల్లోనూ ఐసోలేషన్ సదుపాయాలను కల్పించామన్నారు. దేశంలోనే మొదటి ఎంపాక్స్ కేసు కేరళలోనే ఇటీవల నమోదైంది.

'ఐవీఎఫ్' పిల్లలకు గుండె సమస్యలు

- మిగతా వారితో పోలిస్తే 36 శాతం అధికం
- కవలలుగా పుట్టిన వారిలో మరింత ఎక్కువ
- స్వీడన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడి

స్టాక్‌హోమ్: ఐవీఎఫ్ ద్వారా పుట్టిన పిల్లలకు పుట్టుకతో వచ్చే గుండె సమస్యల ముప్పు ఎక్కువగా ఉంటున్నదని స్వీడన్ పరిశోధకుల అధ్యయనంలో వెల్లడైంది. పరిశోధకులు డెన్మార్క్, ఫిన్లాండ్, నార్వే, స్వీడన్ దేశాలకు చెందిన 20 నుంచి 31 ఏండ్ల మధ్య వయస్కులైన 77 లక్షల మంది ఆరోగ్య రికార్డులు పరిశీలించి ఈ అంచనాకు వచ్చారు. సహజంగా గర్భం దాల్చి జన్మించిన పిల్లలను ఐవీఎఫ్, ఎంబ్రియో ఫ్రీజింగ్ వంటి ఇతర సహాయక పునరుత్పత్తి పద్ధతుల ద్వారా జన్మించిన పిల్లల డాటాను పరిశోధకులు పోల్చారు. సహజంగా జన్మించిన వారితో పోలిస్తే ఐవీఎఫ్ లాంటి సహాయక పునరుత్పత్తి పద్ధతుల ద్వారా జన్మించిన వారిలో 36 శాతం ఎక్కువ గుండె సమస్యలు ఉన్నాయని పరిశోధకులు గుర్తించారు. ఒకవేళ ఐవీఎఫ్ ద్వారా కవలలు పుడితే ఈ ముప్పు మరింత ఎక్కువ ఉంటుందని తేల్చారు. కాగా, తల్లిదండ్రుల్లో వంధ్యత్వానికి, శిశువుల్లో పుట్టుకతో వచ్చే గుండె సమస్యలకు మధ్య సంబంధం ఉన్న అంశం ఏదైనా ఉండొచ్చని పరిశోధకులు భావిస్తున్నారు. పుట్టుకతో వచ్చే గుండె సమస్యలను వేగంగా గుర్తించి సర్జరీ చేయాల్సి ఉంటుందని, తమ అధ్యయనం ఈ మేరకు ఉపయోగపడుతుందని పరిశోధకులు తెలిపారు.

మూడింట ఒక వంతు మందిలో ఎన్ఏఎఫ్ఎల్‌డీ

న్యూఢిల్లీ: మన దేశంలో ప్రతి ముగ్గురిలో ఒకరు నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ డిసీజ్ (ఎన్ఏఎఫ్ఎల్‌డీ) బాధపడుతున్నట్టు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి అపూర్వ చంద్ర తెలిపారు. ఊబకాయం, మధుమేహం, గుండె జబ్బులు వంటి జీవనశైలి వ్యాధులకు మూల కారణాల్లో ఎన్ఏఎఫ్ఎల్‌డీ ఒకటి అని చెప్పారు. ఎన్ఏఎఫ్ఎల్‌డీకి సంబంధించి సవరించిన ఆపరేషనల్ గైడ్‌లైన్స్‌ను కేంద్రం శుక్రవారం విడుదల చేసింది. ఎన్ఏఎఫ్ఎల్‌డీ నుంచి బయటపడాలంటే, క్రమం తప్పకుండా శారీరక కార్యకలాపాలను నిర్వహించాలి. వారానికి కనీసం 150 నిమిషాలపాటు ఏరోబిక్ ఎక్సర్‌సైజ్ చేయాలి. వారానికి రెండుసార్లు దారుఢ్య శిక్షణ పొందాలి. కదలకుండా కూర్చుని ఉండే సమయాన్ని తగ్గించుకోవాలి. ఆల్కహాల్‌ను పూర్తిగా నివారించాలి. ఎన్ఏఎఫ్ఎల్‌డీని సకాలంలో గుర్తించడం వల్ల ఈ వ్యాధి మరింత పెరగకుండా నిరోధించవచ్చునని ఈ మార్గదర్శకాలు తెలిపాయి.

ఇండియన్ యూత్@క్రాస్‌రోడ్స్

- నూటికి 24 శాతం మంది యువత రోడ్డుమీదే
- చదువు, ఉద్యోగం, శిక్షణ, ప్రిపరేషన్ ఇలా దేనిలోనూ లేనివారే వీరంతా.. ఐఎల్‌వో రిపోర్ట్

పనిచేయగల సామర్థ్యం ఉన్న యువశక్తిని వినియోగించుకోలేని ఏ దేశమూ పోటీ ప్రపంచంలో నెగ్గుకురాలేదంటారు నిపుణులు. ఈ విషయంలో భారత్ ఎంతో వెనుకంజలో ఉన్నది. దేశంలో 15-34 ఏండ్ల మధ్య వయసు ఉండి, పనిచేయగల సామర్థ్యమున్న యువతలో దాదాపు పాతిక శాతం మంది ఏ పనిలేకుండా రోడ్ల మీద తిరుగుతున్నట్టు ప్రపంచ కార్మిక సంస్థ (ఐఎల్‌వో) తాజా నివేదికలో వెల్లడించింది. ప్రపంచ సగటు 20.4 శాతంతో పోలిస్తే, భారత్‌లోనే పనిలేకుండా ఉన్న యువత ఎక్కువగా ఉన్నట్టు నివేదిక వివరించింది. తగిన ఉపాధి, ఉద్యోగావకాశాలను కల్పించడంలో ప్రభుత్వం విఫలమవ్వడమే దీనికి కారణంగా తెలిపింది. కాగా, దేశంలో ఉద్యోగ సంక్షోభం గతంలో ఎన్నడూ చూడని స్థాయికి చేరుకున్నది. కొత్త ఉద్యోగాల మాట దేవుడెరుగు.. ఉన్న కొలువులను కాపాడుకోవడానికి కూడా ఉద్యోగులు తీవ్రస్థాయిలో కసరత్తు చేయాల్సి వస్తుండటం ఆందోళనకరంగా మారింది.

-స్పెషల్ టాస్క్ బ్యూరో





తగిన పనిలేకుండా ఉండటం అంటే?

- ఉద్యోగం లేకపోవడం
- విద్యనభ్యసించకపోవడం
- ఏ శిక్షణా తీసుకోకపోవడం
- పోటీపరీక్షలకు సిద్ధంకాకపోవడం

మధుమేహానికి చెక్‌పెట్టే వరి వంగడం

- అభివృద్ధి చేసిన ఫిలిప్పీన్స్ శాస్త్రవేత్తలు
- త్వరలో భారత్‌లోనూ సాగు

మనీలా, సెప్టెంబర్ 27: మధుమేహం బారిన పడ్డవారికి, ప్రీడయాబెటిస్ దశలో ఉన్న వారికి అన్నం ఎక్కువగా తినొద్దని వైద్యులు ముందుగా సూచిస్తుంటారు. మూడుపూటలా అన్నం తినడం అలవాటైన దక్షిణ భారతీయులకు ఈ సూచన పాటించడం కష్టమైన పనే. అయితే, ఇక మీదట ఇలా అన్నం విషయంలో కడుపు కట్టేసుకోవాల్సిన అవసరం లేదని చెప్తున్నారు శాస్త్రవేత్తలు. షుగర్ భయం పక్కనపెట్టి కడుపునిండా తెల్లన్నం తినొచ్చని చెప్తున్నారు. ఫిలిప్పిన్స్‌లోని అంతర్జాతీయ వరి పరిశోధన సంస్థ(ఇఱి)కు చెందిన శాస్త్రవేత్తలు ఇఱి 147, ఇఱి 125 అనే రెండు కొత్త వరి రకాలను అభివృద్ధి చేశారు. ఇప్పుడు మనం తినే తెల్ల బియ్యం లానే ఈ బియ్యం కూడా కనిపిస్తాయని, కొంచెం చిన్న సైజులో ఉంటాయని శాస్త్రవేత్తలు తెలిపారు. మిగతా రకాల బియ్యంతో పోలిస్తే ఈ రెండు వరి రకాలలో గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు తక్కువ ఉంటాయని, ప్రొటీన్ కంటెంట్ ఎక్కువ ఉంటుందని చెప్తున్నారు.

మధుమేహులకు ఉపయోగమేంటి?

ఏదైనా ఆహారం తిన్న తర్వాత మన రక్తంలో షుగర్ లెవెల్స్ పెరిగే స్థాయిని బట్టి గ్లైసెమిక్ ఇండెక్స్(జీఐ)ను నిర్ణయిస్తారు. డయాబెటిస్ ఉన్న వారు, ప్రీడయాబెటిస్ దశలో ఉన్న వారు గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువ ఉన్న ఆహారం తినడం మంచిది. తద్వారా మధుమేహాన్ని అదుపులో ఉంచుకోవచ్చు. సాధారణంగా ఇప్పుడు మనం తినే అన్నం గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయి 70 నుంచి 92 వరకు ఉంటుందని, ఇఱి 147 రకం బియ్యం గ్లైసెమిక్ ఇండెక్స్ 55 అని, ఇఱి 125 రకం గ్లైసెమిక్ ఇండెక్స్ 51.1 అని శాస్త్రవేత్తలు తెలిపారు. ఏదైనా ఆహారంలో జీఐ 45 కంటే తక్కువగా ఉంటే దానికి 'అతి తక్కువ' అని, 46-55 మధ్య ఉంటే 'తక్కువ' అని, 56-69 మధ్య ఉంటే 'మధ్యస్థ' అని, 70 కంటే ఎక్కువ ఉంటే 'ఎక్కువ' అని భావిస్తున్నారు. ఈ లెక్కన ఈ రెండు కొత్త వరి రకాల గ్లైసెమిక్ ఇండెక్స్ స్థాయిలు 'తక్కువ'గా ఉన్నట్టు లెక్క.

త్వరలోనే పండించేందుకు ప్రయత్నాలు

ఈ రెండు కొత్త వరి రకాలను వచ్చే ఏడాది భార